RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



2 లో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :217 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 4 జూలై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# భారత్ రక్షణ మరింత పటిష్ఠం..

రూ.52 వేల కోట్లతో ఆయుధాల కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్

రూ.52 వేల కోట్ల కొనుగోళ్లకు ఆమోదం – రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన డీఏసీ సమావేశం

సైన్యానికి యాంటీ డ్రోన్ వ్యవస్థలు – నౌకాదళానికి కొత్త డ్రోన్లు, మైన్లు – వాయుసేనకు అధునాతన నిఘా వ్యవస్థ



**న్యూఢిల్లీ:** భారత సాయుధ దళాల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) సమావేశంలో సుమారు రూ.52 వేల కోట్ల విలువైన రక్షణ కొనుగోళ్లకు ఆమోదం లభించింది. భారత సైన్యం కోసం యాంటీ డ్రోన్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థ 'ఆకాశ్ తరంగ్', మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైళ్లు, మీడియం రేంజ్ 'సర్ఫేస్ టు ఎయిర్' మిసైల్ వ్యవస్థ, వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, ట్యాంకులకు యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్, జెట్ ఆధారిత కమికాజే డ్రోన్ వ్యవస్థ కొనుగోళ్లకు ఆమోదం లభించింది. నౌకాదళం కోసం మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్స్, మిగతా 2లో...



# ఎస్ఐఆర్ నిలిపేయండి

## సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి

సుప్రీంకోర్టుకు 23మంది విపక్ష నేతల లేఖ

ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం

ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు

కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ

ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య

**న్యూఢిల్లీ:**దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు మిగతా 2లో...

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

### కేంద్రం ఉత్తర్వులు

-నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం

-మే 4న పేర్లు ఖరారు చేసిన కొలీజియం

-కేంద్రం పరిశీలన తర్వాత ఉత్తర్వులు



**అమరావతి, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మిగతా 2లో...

## సీఎం విజయ్‌పై వ్యాఖ్యలు

డీఎంకే ఎమ్మెల్యే అరెస్ట్

ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన మద్రాస్ హైకోర్టు

డీఎంకే సభలో ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేసిన రాధాకృష్ణన్

ఇది ప్రభుత్వ అణచివేతేనని డీఎంకే ఎంపీ కనిమొళి విమర్శ



**తమిళనాడు, సింధూరదర్శిని:** ముఖ్యమంత్రి విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి, ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించారనే ఆరోపణలతో డీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిత ఆర్.రాధాకృష్ణన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన మిగతా 2లో...





# ఉక్కు రాష్ట్రంగా ఏపీ

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం – 2028లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి

కియా అభివృద్ధికి... బ్రాహ్మణీ స్టీల్స్ అవినీతికి నిదర్శనం- అనంత నుంచి 90 దేశాలకు కియా కార్ల ఎగుమతి

బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో ఐరన్ ఓర్ దోపిడీ, విదేశాలకు స్మగ్లింగ్

సున్నపురాళ్లపల్లిలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు

జేఎస్‌డబ్ల్యూ నియోఎనర్జీ, విజయనగరంలో పారిశ్రామిక ప్లాంట్‌కు శంకుస్థాపన

**కడప జిల్లా, సింధూరదర్శిని:** పరిశ్రమలు, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం సహా, ఆర్సెల్లార్ మిట్టల్, వైజాగ్ స్టీల్‌తో ఆంధ్రప్రదేశ్ ఉక్కు రాష్ట్రంగా మారుతుందని ఆయన అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపు రాళ్ల పల్లిలో జిందాల్ సౌత్ వెస్ట్ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. జేఎస్‌డబ్ల్యూ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మలతో కలిసి సీఎం ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టారు. రాయల సీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులూ సీఎం ప్రారంభించారు. ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో రూ.16,350 కోట్ల మిగతా 2లో...


## అమరావతి ఓ భారీ అవినీతి యజ్ఞం

త్వరలోనే కోర్టుకు వెళతా: విజయసాయి రెడ్డి సంచలన ట్వీట్

రాజధానిపై టీడీపీ, వైసీపీల వాదనలు అర్థరహితమని విజయసాయిరెడ్డి విమర్శ

అమరావతి అవినీతిపై పూర్తి ఆధారాలతో త్వరలో కోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి

విభజన జరిగి 12 ఏళ్లయినా రాజధానిపై చర్చ కొనసాగడం సిగ్గుచేటని వ్యాఖ్య



**అమరావతి, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న తరుణంలో, రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి తీవ్రమైన ఆరోపణలతో ముందుకొచ్చారు. టీడీపీ 'అమరావతి' అంటుంటే, వైసీపీ 'మావిగన్' మిగతా 2లో...

## భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదు



హద్దులు దాటి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదన్న దుర్గేశ్

పవన్ పై పద్ధతి ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు

కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయాలని వైసీపీ కుట్రలు చేస్తోందన్న మంత్రి

**అమరావతి, సింధూరదర్శిని:** "సోషల్ మీడియాలో భావప్రకటన స్వేచ్ఛ ఉంది కదా అని హద్దులు దాటి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదు.. అది బూతులు తిట్టడానికి ఇచ్చిన లైసెన్స్ కాదు" అని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు మిగతా 2లో...

## సీఎం విజయ్‌పై వ్యాఖ్యలు

**(మొదటిపేజీ తరువాయి)**

ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల నిర్వహించిన డీఎంకే బహిరంగ సభలో రాధాకృష్ణన్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దివంగత కరుణానిధి జయంతి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సభలో, సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌ను, అసెంబ్లీలో ఆయన ప్రవర్తనను ఎగతాళి చేస్తూ రాధాకృష్ణన్ మాట్లాడారు. దీనిపై అధికార తమిళగ వెట్రి కజగం (టీవీకే) నాయకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే, స్థానిక టౌన్ పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న రాధాకృష్ణన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టును డీఎంకే ఎంపీ కనిమొళి తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష నేతలను అణచివేస్తోందని ఆమె ఆరోపించారు.

## భారత్ రక్షణ మరింత పటిష్ఠం..

**(మొదటిపేజీ తరువాయి)**

నౌకల నుంచి ప్రయోగించే మానవరహిత వైమానిక వ్యవస్థలకు, ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థల పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దీంతో సముద్ర నిఘా, శత్రు కదలికల పర్యవేక్షణ సామర్థ్యం పెరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. వాయుసేన కోసం 'ఫిక్స్‌డ్ వింగ్ హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్' కొనుగోలుకు కూడా డీఏసీ ఆమోదం తెలిపింది. దీని ద్వారా దీర్ఘకాలిక నిఘా, ఇంటెలిజెన్స్, టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ సామర్థ్యాలు మరింత బలోపేతం కానున్నాయి. ఈ కొనుగోళ్లతో మూడు దళాల యుద్ధ సన్నద్ధత, సరిహద్దుల భద్రత, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలు మరింత పెరుగుతాయని రక్షణ శాఖ వెల్లడించింది.

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

**(మొదటిపేజీ తరువాయి)**

వెల్లడించారు. అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తంకుమార్ చింతలపూడి నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఈ నియామ కాలు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీ జియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది. హైకోర్టు న్యాయ మూర్తుల నియామక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపి స్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసు కుంటుంది. అన్నిదశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

## అమరావతి ఓ భారీ అవినీతి యజ్ఞం

**(మొదటిపేజీ తరువాయి)**

అనడం వంటి అర్థరహిత వాదనలను పక్కనపెట్టి, రాజధాని పేరుతో జరుగుతున్న భారీ అవినీతిపై దృష్టి సారించాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. అమరావతి నిర్మాణం పేరుతో సుమారు రూ.15,000 కోట్ల అవినీతి కి పథకం రచించారని, ఈ అవినీతి యజ్ఞంపై పూర్తి ఆధారాలతో త్వరలోనే కోర్టును ఆశ్రయిస్తానని ఆయన సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ఒక బాధ్యతగల పౌరుడిగా తన అభిప్రాయాలను పంచుకుంటున్నా నంటూ విజయసాయి రెడ్డి పలు కీలక ప్రశ్నలను సంధించారు. "రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా ఇంకా రాజధాని ఎక్కడో తేల్చకుండా చర్చించడం అందరూ సిగ్గుపడాల్సిన విషయం కాదా? 2029 ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలే నిర్ణయించాలా? ఈ రాజకీయ చదరంగానికి అన్ని పార్టీలు బాధ్యత వహించవద్దా?" అని ఆయన నిలదీశారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికను ఎందుకు పక్కనపెట్టారని ఆయన ప్రశ్నిం చారు. అమరావతి నిర్మాణంలో జరుగుతున్న అవినీతిని ఆయన వివరంగా ఆరోపించారు. "ప్రస్తుత ప్రభుత్వం రాజధాని నిర్మాణం కోసం రూ.50,000 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రతి నిర్మాణంలోనూ అంచనాలను భారీగా పెంచి చూపారు. ఇది 'దేవతల నగరం' అనే బ్రాండింగ్‌తో సాగుతున్న అతిపెద్ద అవినీతి పథకం. అధికారంలో ఉన్నవారు 25 నుంచి 30 శాతం వరకు కమీషన్లుగా దండుకుంటున్నారు. అంటే ఇది సుమారు రూ.15,000 కోట్ల లంచాల స్కామ్. అసలు అమరేశ్వర ఆలయం, బుద్ధుని విగ్రహం ఉన్న ప్రాంతానికి, ఇప్పుడు భవనాలు కడుతున్న ప్రాంతానికి 50 కిలోమీటర్ల దూరం ఉంది. ఆ అమరావతి పుణ్యక్షేత్రం అయితే, ఈ అమరావతి అవినీతి ప్రవహి ంచే క్షేత్రం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. మొదటి దశ భూ సమీక రణలో భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ ప్లాట్లు కేటాయించక పోవడాన్ని ఎలా సమర్థించుకుంటారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైసీపీ 'మావిగన్' అనడం వల్ల ప్రయోజనమేంటని, ఇప్పటికే పూర్తయిన నిర్మాణాల గతేంటని ఆయన ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం అంటే పార్టీలు కమీషన్లు దండుకోవడం కాదని హితవు పలికారు. అమరావతి పేరుతో జరుగుతున్న ఈ అవినీతిపై ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో, ప్రజాపక్షాన త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదు

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రచారాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను దుర్వినియోగం చేస్తూ సమాజ వాతావరణాన్ని పాడుచేసే వారిపై చట్టం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో కొందరు కావాలనే పద్ధతి ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే, తద్వారా కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చునే కుట్రపూరిత వ్యూహంతో వైసీపీ సోషల్ మీడియా వింగ్ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం తమ యూట్యూబ్ ఛానళ్లు, పేజీల వ్యూస్ పెంచుకోవడం కోసం డిప్యూటీ సీఎం పేరును వాడుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుం దని, కానీ హద్దులు దాటి వ్యక్తిత్వ హననానికి పాల్పడే హక్కు ఎవరికీ లేదని, అందుకే సోషల్ మీడియాపై తగిన నియంత్రణ అవసరమని మంత్రి అభి ప్రాయపడ్డారు. ఇదే సమయంలో విశాఖపట్నంలోని వివాదాస్పద రుషికొండ ప్యాలెస్ భవిష్యత్తు వినియోగంపైనా కందుల దుర్గేశ్ కీలకవివరాలు వెల్లడిం చారు. రుషికొండ భవనాలను పర్యాటకాభివృద్ధికి, అలాగే ప్రజల సందర్శన కోసం వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దీని నిర్వహణను చేపట్టేందుకు ఇప్పటికే 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (EOI)'ను ఆహ్వానించినట్లు చెప్పారు. ఇకపై ఆ నష్టాల నుంచి పర్యాటక రంగాన్ని గట్టెక్కించి, రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

# ఉక్కు రాష్ట్రంగా ఏపీ



**(మొదటిపేజీ తరువాయి)**

పెట్టుబడితో రెండు దశల్లో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కానుంది. ఉక్కు ఉత్పత్తి, సోలార్ ప్రాజెక్టు ద్వారా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించను న్నాయి. 3,850 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేలా నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. రూ.20,350 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. జమ్మలమడుగు నుంచి విజయనగరం జిల్లాలోని జేఎస్‌డబ్ల్యూ పారి శ్రామిక పార్కును కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. విజయనగరం జిల్లాలో 1,166 ఎకరాల్లో అత్యాధునిక పారిశ్రామిక పార్కును జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.531 కోట్ల ను జిందాల్ సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు.

**దశాబ్దల నిరీక్షణ నిజమైంది**

రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారం భించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. సీఎం మాట్లాడుతూ.." రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం గురించి దశాబ్ద కాలం పాటు ఎదురు చూశాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ హామీ నెరవేరింది. రాయలసీమ అంటే ఇప్పుడు హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్- రాయల్ ఎన్ ఫీల్డ్. కియాకార్లు, హీరో బైక్స్ , డ్రోన్లు, ఫైటర్ జెట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీ. సీమ ఇకపై ఏమాత్రం కరువు నేల కాదు, జలకళ ఉట్టిపడే పచ్చని ప్రాంతం. పరిశ్రమలు, రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో ఓ నవ శకం మొదలైంది. విభజన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, అనుమానాలు దాటుకుని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేశారు. 2019లో ఓసారి, 2023లో మరోమారు శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టాం. పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో ఉక్కు ఉత్పత్తి చేస్తారు. విశాఖ ఉక్కు సంక్షోభంలో ఉన్నప్పుడు కేంద్రంతో మాట్లాడి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయంతో ఆదుకున్నాం. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. జేఎస్‌డబ్ల్యూ బళ్లారి ప్లాంట్ కంటే అధిక సామర్థ్యంతో రాయలసీమ ప్లాంట్‌ను తీర్చిదిద్దాలి. గండికోట నుంచి 15 కిలోమీటర్ల మేర పైప్ లైన్ వేసి 2 టీఎంసీల నీటిని స్టీల్ ప్లాంట్ కు సరఫరా చేస్తాం. రాయలసీమ ప్రాంతంలో ఉన్న అత్యంత నాణ్యమైన ముడి ఇనుము ఖనిజాన్ని కూడా ప్లాంట్ కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**గత పాలనలో రాయలసీమ నష్టపోయింది**

రాయలసీమ ఎవరి వల్ల నష్ట పోయిందో ప్రజలు గుర్తించాలని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. "దేశవ్యాప్తంగా పోటీ ఉన్నా 2017లో అనంతపురం జిల్లాకు కియా కార్ల పరిశ్రమను తీసుకువచ్చాం. 536 ఎకరాలను కేటాయించి, నీళ్లు ఇచ్చి ఉత్పత్తికి అన్ని విధాలా సహకరించాం. మేం తెచ్చిన కియా కంపెనీ 19 లక్షల కార్లు ఉత్పత్తి చేసింది. ఇందులో 3 లక్షల కార్లు 90 దేశాలకు పైగా ఎగుమతి అయ్యాయి. కియాతో అనంతపురం దశదిశా మారింది. గతంలో కొందరు స్వార్థపరులు కేవలం సొంత ప్రయోజనాల కోసమే పనిచేసి అక్రమాలు చేశారు. 2007లో 14వేల ఎకరాలను బ్రహ్మణీ స్టీల్స్ కు భూములు ఇచ్చి భ్రమలు కల్పించారు. ఎయిర్ పోర్టు కడతామని అన్నారు. ఇప్పటి వరకూ అతీగతి లేదు. క్యాప్టివ్ మైనింగ్ అని చెప్పి ఓబుళాపురం గనుల నుంచి దోపిడీ చేశారు. ముడి ఇనుము ఖనిజాన్ని విదేశాలకు స్మగ్లింగ్ చేశారు. అసలు ప్లాంటే పెట్టలేదు. దేశానికి ఉపయోగపడాల్సిన సంపద విదేశాలకు తరలిపోయింది. తప్పు చేసిన వ్యక్తులు జైలుకు వెళ్లారు. ఈ ఒక్క ఉదాహరణతోనే ఎవరిది విశ్వసనీయతో, ఎవరు మోసగాళ్లో అర్థం అవుతుంది. రాయలసీమ సంపద ఈ ప్రాంత అభివృద్ధికే ఉపయోగపడాలి. ఇక్కడి ముడి ఇనుముతో ఇక్కడే ఉక్కు తయారు కావాలి. రాష్ట్రానికి చెందిన యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పిస్తాం. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి కడప జిల్లాకు, రాయలసీమకు ఏమీ చేయలేదు." అని సీఎం అన్నారు.

**విశ్వసనీయత లేని పార్టీకి విలువెక్కడ**

'గత పాలకులు రాయలసీమలో ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేక పోయారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరలోనే ఇస్తాం. సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుస్తాం. అవుకు టన్నెల్ పూర్తి చేసి పులివెందులలో చీని తోటలు కాపాడాం. ఎర్రబెల్లి చెరువుకు నీళ్లు ఇచ్చి రైతుల కష్టాలు తీర్చాం. సీమలో స్పేస్, ఏరో స్పేస్, డిఫెన్సు, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయి. స్పేస్ సిటీలో, డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు జేఎస్‌డబ్ల్యూ ముందుకు వచ్చింది. నమ్మకంతో, విశ్వాసంతో పాలన అందిస్తున్నాం కాబట్టే పెట్టుబడులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానంతో ఆటలు ఆడుకోవద్దని చెబుతున్నాను. గత పాలనలో మన రాజధాని ఏమిటో ఎక్కడుందో కూడా చెప్పలేని పరిస్థితి. వారికి విశ్వసనీయతే లేదు. నిన్న మావిగన్ అన్నారు. నేడు విజయవాడ అంటున్నారు. మతిస్థిమితం లేని వ్యక్తులు రాజకీయం చేస్తున్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని, ప్రజల్ని తీవ్రంగా నష్ట పరిచారు. ప్రజలంతా కాలరెత్తుకుని చెప్పుకునేలా అమరావతిని అభివృద్ధి చేస్తాం. హింస, నేరాలతో కాదు.. ప్రజల కోసం బాధ్యతగా రాజకీయాలు చేయాలి. విజయవాడ యువకుడి అదృశ్యం ఘటనను కూడా రాజకీయం చేసేలా వైసీపీ వ్యవహరిస్తోంది. పోలీసులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉన్నారు. విధ్వంసమే గొడ్డలి పార్టీకి అజెండా. గంజాయి బ్యాచ్ విషయంలో కఠినంగా ఉండాలని ఆదేశించాను. మా హయాంలో శాంతిభద్రతలకే పెద్ద పీట. అలాగే, హార్టీకల్చర్ సాగుతో లింగాల మండలంలో రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం వస్తోంది. ఆగస్టు 15 నాటికి గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్‌కు మదనపల్లిలో శంకుస్థాపన చేస్తాం. రాయలసీమ హార్టీకల్చర్ హబ్ కోసం పూర్వోదయ పథకం కింద రూ.40 వేల కోట్లు వ్యయం చేస్తాం. ప్రైవేటు రంగం నుంచి మరో రూ.60 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి. అమెరికాలో ఉన్న గ్రాండ్ కాన్యాన్‌కు ధీటుగా మన గండికోటను అభివృద్ధి చేస్తాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

# ఎస్ఐఆర్ నిలిపేయండి.. సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి

**(మొదటిపేజీ తరువాయి)**

ఏర్పడిందని ఆరోపించాయి.దకాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛా యుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలు దెబ్బతింటున్నా యని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరి గాయని తెలిపారు. ఒక న్యాయ ట్రైబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం


**పదేళ్ల నిర్వహణకు 4,500 కోట్లతో టెండర్లు**

**శాశ్వత సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



జగ్గయ్యపేట, సింధూరదర్శిని: రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చి 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట నియోజకవర్గంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటిం చారు. 15 కోట్లతో అక్కడి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల రిపేర్లు, పది సంవత్సరాలు పాటు నిర్వహణ పనుల కోసం 4,500 కోట్లతో టెండర్లు పిలుస్తున్నట్లు రామానాయుడు చెప్పారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగానికి 18వేలకోట్లు అప్పు పెట్టి వెళ్లిపో యాడన్నారు. పోలవరం డయాఫ్రమ్వాల్, అన్నమయ్య తదితర ప్రాజెక్టుల విధ్వంసానికి జగన్ కారకుడు అయ్యాడు అన్నారు. నిర్వహణ పనులు కోసం ఐదేళ్లలో వైసిపి 200 కోట్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వ హయాంలో రెండేళ్లలోనే 1200 కోట్లు ఖర్చు చేసినట్లు రామానాయుడు చెప్పారు. రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల కింద 8.2 లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉండగా గొడ్డలి పార్టీ విధ్వంసం వల్ల నాలుగు లక్షల ఎకరాలు మూత పడింది అన్నారు. వైకాపా హయాంలో మరమ్మత్తులకు ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో లిఫ్ట్ స్కీములు మూతపడ్డాయి అన్నారు. రాష్ట్రంలో 1023 లిఫ్ట్ స్కీములు ఉంటే కేవలం 166 మాత్రమే పని చేస్తున్నాయని మంత్రి చెప్పారు. 2021 నుండి వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం పనిచేయపోవటానికి వైసిపి ప్రభుత్వ నిర్వాకమే కారణమని ఆయన అన్నారు. 15 కోట్లతో చేపడుతున్న ప్రస్తుత పునరుద్ధరణ పనులు పూర్తి అయితే జగ్గయ్య పేట, నందిగామ నియోజకవర్గాల్లోని 17,366 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించగలదన్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వంలో, వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం నిర్వహణ కోసం, 5.36 కోట్లు ఖర్చు చేసి సాగునీరందించామని ఆయన గుర్తు చేశారు. 2027 ఖరీఫ్ సీజన్ నాటికి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో ఇరిగేషన్ రంగం విధ్వంస మైందన డానికి ఐడిసినే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన ఉదహరించారు. రాజధాని విషయంలో జగన్ మావిగన్ అంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. పూటకో మాట, పేటకో మాట అన్న చందంగా ఉంది ఆయన తీరు అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతిని ఆహ్వానించి అధికారంలోకి వచ్చాక, మూడు రాజధానులు అంటూ మూడుముక్కలాటాడారు అన్నారు. తెలంగాణకు హైదరాబాదు, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధాని నగరాలుగా ఉంటూ లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయన్నారు. అలాగే అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ గా ముఖ్యమంత్రి రూపకల్పన చేశారన్నారు. ఫలితంగా ఏటా లక్ష కోట్లు రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. ఈ లక్షకోట్లతో 175నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్య, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఐడీసీఎండి తిరుమలరావు, కెడిసి సిఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# నెల్లూరు గడప ముందుకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి - నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

## స్థానిక యువతకు నెల్లూరులోనే ఐటీ భవిష్యత్తు

నెల్లూరు( సింధూర దర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో (టూ-టైర్ సిటీస్) యువత ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా, వారి గడప ముందుకే సాఫ్ట్‌వేర్ అవకాశాలను తీసుకురావడం అభినందనీయమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన నగరపు మొట్టమొదటి మల్టీ-కంపెనీ ఏఐ ఇన్నోవేషన్ పార్క్ 'నెక్సస్ ఇన్నోవేషన్ హబ్' ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటు చదువుకుంటున్న విద్యార్థులకు, కళాశాల విద్య పూర్తి చేసుకున్న యువతకు ఎంతో మోటివేషన్ ఇస్తుందన్నారు. ప్రస్తుతం ప్రపంచం చాలా వేగంగా మారుతోందని, ఆ వేగాన్ని అందుకోవడం టూ-టైర్ నగరాల్లో కొంచెం సవాలుతో కూడుకున్నదైనప్పటికీ, రెనిల్ రెడ్డి కోమిట్ల లాంటి వ్యక్తులు ముందుకు రావడం నెల్లూరు జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా రెనిల్ రెడ్డి నేపథ్యాన్ని ఎంపీ గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు నెల్లూరు ట్రంక్ రోడ్డులో రేణిల్ తాత ఒక చిన్న సైకిల్ షాప్ నిర్వహించేవారని, అలాంటి సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన రేణిల్, విదేశాలకు వెళ్లి ప్రపంచ స్థాయి కంపెనీలను స్థాపించారని చెప్పారు. ఆ తర్వాత పుట్టిన ఊరికి ఏదైనా చేయాలని నెల్లూరుకు తిరిగి వచ్చి, 2022లోనే టెర్రాలాజిక్ కంపెనీ ప్రారంభించారని పేర్కొన్నారు. ఆయన ప్రయాణం నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు.

సీఎం చంద్రబాబు నాయుడి పిలుపునకు నిదర్శనం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ యువతకు సొంతప్రాంతాల్లోనే పరిశ్రమలు నెలకొల్పి, ఇతరులకు ఉపాధి కల్పించాలని చెబుతుంటారని, నేడు రెనిల్ రెడ్డి అదే బాటలో నెక్సస్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశారని ఎంపీ అన్నారు. ప్రస్తుతం ఈ హబ్ ద్వారా 150 మందికి ఉపాధి లభించిందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 5,000 కు పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడని స్థానిక యువతకు ఈ కేంద్రం ఒక సువర్ణావకాశం అన్నారు. విద్యార్థులు తమ సొంత ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చుకోవడానికి ముందుకు రావాలని, నెల్లూరు ఎంపీగా ఈ ఇన్నోవేషన్ హబ్‌లకు, యువతకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి , రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజీజ్ , సంస్థ వ్యవస్థాపకులు రెనిల్ రెడ్డి కోమిట్ల దంపతులు పాల్గొన్నారు.

# కేసుల వివరాలు పై అధికారులతో సమీక్ష




## ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

నెల్లూరు( సింధూరదర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, , నెల్లూరులోని డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ల వారీగా నమోదైన కేసుల వివరాలను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ క్రింది అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు.

1.ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం రాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలి.

2.నేరాల ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి.

3.జిల్లాలో నాటుసారా తయారీ, రవాణా మరియు విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

4.బెల్టు దుకాణాలు మరియు బహిరంగ మద్యపానాన్ని అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలి.

5.ప్రస్తుత మద్యం దుకాణాల లైసెన్సుల గడువు మరో మూడు నెలలు మాత్రమే ఉన్నందున, లైసెన్సు ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, మద్యం దుకాణాలలో ఎటువంటి అనధికార సరుకు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.

6.పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు కేసులలో త్వరితగతిన చార్జ్ షీట్లు దాఖలు చేయాలి.

7.గంజాయి అక్రమ రవాణా మరియు వినియోగాన్ని కట్టడి చేయడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే మద్యం క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలి.

8.ఇతర రాష్ట్రాలలో అరెస్టు కావలసిన ముద్దాయిలను త్వరితగతిన అరెస్టు చేసి, సంబంధిత కేసులలో చార్జ్ షీట్లు దాఖలు చేయాలి.

9.ఎన్‌డీపీఎస్, గంజాయి మరియు ఇతర కేసుల ముద్దాయిలను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలి అని తెలిపారు.

ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, నెల్లూరు జిల్లా ఎం. శంకరయ్య , సహాయ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, నెల్లూరు జిల్లా పి. దయాసాగర్ , అలాగే నెల్లూరు జిల్లాలోని 11 ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# బిఎల్‌వోలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

## విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు (సింధూర దర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ;. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పాల్గొంటున్న బూత్ లెవెల్ ఆఫీసర్లు అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు వెంగళరావు నగర్ ప్రాంతంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని లకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటి సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సమాచారం కోసం ఫోన్ చేసిన ఓటర్లందరకు సమాచారం అందించాలని బి ఎల్ వో లకు సూచించారు. ఓటర్ల నుండి అందుతున్న దరఖాస్తులను సకాలంలో పరిశీలించి, నిర్దేశిత విధానాల ప్రకారం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ అనూష, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




# బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

## - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి -


నెల్లూరు (సింధూర దర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; ఆర్థికంగా వెనుకబడిన, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసాగా నిలుస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీ నెల్లూరులోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 5 మంది లబ్ధిదారులకు రూ.7.57 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం వారి వైద్య, అత్యవసర అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తన కార్యాలయం ద్వారా మొత్తం 144 మంది లబ్ధిదారులకు రూ.1.91 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేదలు, అవసరమైన సమయంలో ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడకుండా వారికి ప్రభుత్వం అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులు అందరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్



నెల్లూరు (సింధూర దర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం పనితీరును శుక్రవారం పరిశీలించారు. కంట్రోల్ సెంటర్ ద్వారా అందిస్తున్న వివిధ సేవలను పర్యవేక్షించారు. స్వచ్ఛ సర్వేక్షణ్, ఎస్.ఐ.ఆర్ పురోగతి అంశాలపై వార్డు సచివాలయ కార్యదర్శులతో సిబ్బంది ఫోన్ కాల్స్ ద్వారా మానిటరింగ్ చేస్తున్న విధానాలను కమిషనర్ పరిశీలించారు. కంట్రోల్ సెంటర్లో సీసీటీవీల ద్వారా జరుగుతున్న మానిటరింగ్, పారిశుధ్య నిర్వహణ పనులు, అన్న క్యాంటీన్‌ల నిర్వహణ తీరును కమిషనర్ పరిశీలించి సిబ్బందికి వివిధ సూచనలు జారీ చేశారు.

# గణనాధుని సేవలో సినీ నటుడు బాబు మోహన్



కాణిపాకం (సింధూర దర్శిని) 3 జూలై చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మరియు ప్రముఖ నటుడు బాబు మోహన్ , స్వామివారిని దర్శించుకున్నారు, వీరితోపాటు పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సంకటహార గణపతి వ్రతం

కాణిపాకం ( సింధూర దర్శిని) 3 జూలై చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం ఆస్థాన మండపం నందు శుక్రవారం సంకటహార చతుర్థి సందర్భంగా వైభవంగా శ్రీ స్వామివారి సంకటహార గణపతి వ్రతం ఉదయం మరియు సాయంత్రం 4 బ్యాచుల్లో ఈ వ్రతంని నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పూతలపట్టు శాసనసభ్యులు. డాక్టర్ కలికిరి మురళీమోహన్ , ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాలాజీ నాయుడు, రవి, అర్చకులు, వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు.



# బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించ రాదు

**పోక్సో కేసులు, బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు**



తిరుపతి ( సింధూర దర్శిని) 3 జూలై తిరుపతి జిల్లా ; బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణ పై మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం, కార్మిక శాఖ, విద్యా శాఖ, పోలీసు శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీ బాబు, శ్రీనివాసమూర్తి, పద్మలత , జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి శాఖ అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బాల కార్మికుల నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం, పోక్సో కేసుల దర్యాప్తు, బాధితుల పునరావాసం, బాలల అక్రమ రవాణా నివారణ, టీనేజ్ ప్రెగ్నెన్సీ, గంజాయి కేసులు, పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యలో చేర్చడం వంటి అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పోక్సో కేసుల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, బాధిత పిల్లలకు అందించిన పరిహారం, పునరావాస చర్యలు, జనన ధ్రువీకరణ పత్రాల జారీ, వివిధ శాఖల సమన్వయంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్పొరేట్ బిమరియు ప్రైవేటు విద్యాసంస్థల్లో బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు పరిశుభ్రమైన వసతి, సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, నాణ్యమైన ఆహారం, ఆరోగ్య సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఏ శాఖ నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమని, జిల్లా స్థాయిలో గుర్తించిన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికతో పాటు తగిన సిఫారసులు సమర్పిస్తామని చైర్మన్ తెలిపారు. కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీ బాబు మాట్లాడుతూ బాలల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బాలుడి సంక్షేమం, భద్రత రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాల చట్టవిరుద్ధం పోస్టర్ ఆవిష్కరణ ను ఆవిష్కరించారు. ఈ సమావేశం లో డి ఆర్ ఓ నరసింహులు, ఐసిడిఎస్ పిడి, డిఎం అండ్ హెచ్ ఓ, జిల్లా బాలల సంరక్షణ అధికారి, డీఈవో, ఎస్సీ, ఎస్టీ బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, కార్మిక శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం చేపట్టాలి**

**ప్రతిరోజూ ప్రజలకు సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్**



తిరుపతి( సింధూర దర్శిని) 3 జూలై తిరుపతి జిల్లా ; తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత తో నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, నగర ప్రజలకు ప్రతిరోజూ సురక్షిత తాగునీటి సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల పురోగతి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. డ్రైనేజీ కాలువ లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నగరంలో చెత్త కుప్పలు పేరుకు పోకుండా పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ -2026 ప్రాధాన్యతగా తీసుకొని ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పగడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఇంచార్జి నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీమతి శారదా దేవి వివిధ విభాగాల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, హెల్త్ ఆఫీసర్ డా. యువఅన్వేష్, డీసీ ఓ దేవికుమారి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, డి ఈ లు, సానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మూడవ మహాసభను జయప్రదం చేయండి: డిపి పోలయ్య



గూడూరు( సింధూర దర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; ఐ ఎఫ్ టి యు జిల్లా 3వ మహాసభ జూలై 15న గూడూరులో రిటైర్డ్ అధికార భవనంలో జరుగుతుందని ఆ మహాసభను జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని సభను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు డిపి పోలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సైదాపురం ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మహాసభకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆ సందర్భంగా అధ్యక్షులు పోలయ్య మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించే కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేకమైనవని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను ఈ కోడ్స్ ద్వారా హరించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల లక్షలాది మంది కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడం, కనీస వేతన చట్టాలు అమలు కాకపోవడం, కార్మిక సంక్షేమ చట్టాలను యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. దేశవ్యాప్తంగా “సమాన పనికి సమాన వేతనం” సూత్రాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, సామాజిక భద్రతా పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికోద్యమాన్ని బలోపేతం చేసేందు, సమస్యలపై పోరాడేందు అవసరమైన నాయకత్వాన్ని రూపొందించుటకు నెల్లూరు జిల్లా ఐఎఫ్ టియు 3వ మహాసభలను జూలై 15న గుడూరు, (కామ్రేడ్ రాగన్న హాలు) రిటైర్డు ఉద్యోగుల భవనము నందు నిర్వహించుకుంటుంది. ఈ సభలకు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కార్మికలోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి చెంగళరావు, జిల్లా నాయకులు మస్తానయ్య, జిల్లా అధ్యక్షా కార్యదర్శులు. నవకోటి, అనీల్, నాయకులు వెంకట రమణయ్య, రత్నాయ్యాలు పాల్గొనారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

నెల్లూరు (సింధూర దర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి 26వ విడత చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 20 మంది లబ్ధిదారులకు రూ.8.38 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మొత్తం 921 చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వాటి ద్వారా రూ.9.32 కోట్ల ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు.

## పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్

**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



గూడూరు (సింధూరదర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా; పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 24 లక్షల 96 వేల 36 రూపాయలు 54 చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని, రాష్ట్ర ప్రజల అభివృద్ధి సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య , చిన్న వైయస్సార్ , అబ్దుల్ రహీం, నెలబల్లి భాస్కర్ రెడ్డి, గణపర్తి కిషోర్ నాయుడు తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీవారికి వైభవంగా వసంతోత్సవం చక్రస్నానం



గూడూరు(సింధూరదర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని రాజా వీధిలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ చైర్మన్ శ్రీ కంటి రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం శ్రీవారికి వసంతోత్సవం, చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన విశేష పూజల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసా దాలు స్వీకరించారు. ఉభయ దాతలుగా గమిడి వెంకట సుబ్బయ్య, విజయ లక్ష్మి, సునీల్ క్రిష్ణ, సంధ్య,అనుమకొండ శ్రీనివాసులు, సురేఖ, చైతన్య, ఆకాంక్ష, జొన్నా మురళీ క్రిష్ణ,దేవి సుచరిత, జొన్నా బాలక్రిష్ణ వ్యవహరించారు.



# అంతర్ రాష్ట్ర ముఠా అరెస్ట్

**నకిలీ ఆధార్ కార్డులతో టీటీడీ గదుల అక్రమ బుకింగ్**

**టీటీడీ విజిలెన్స్ సమాచారంతో తిరుమల 2 టౌన్ పోలీసుల విజయవంతమైన చర్య**

**నలుగురు నిందితుల అరెస్ట్**

**12 నకిలీ ఆధార్ కార్డులు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం**

**దళారులను ఆశ్రయించవద్దని శ్రీవారి భక్తులకు పోలీసుల విజ్ఞప్తి**



తిరుపతి (సింధూర దర్శిని) 3 జూలై తిరుపతి జిల్లా ; తిరుమలలో సామాన్య భక్తులకు కేటాయించే టీటీడీ వసతి గదులను నకిలీ ఆధార్ కార్డులతో అక్రమంగా పొందుతూ, గదులు దొరకని భక్తులకు అధిక ధరలకు విక్రయించి అక్రమ లాభాలు పొందుతున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను టీటీడీ విజిలెన్స్ సమాచారంతో తిరుమల II టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. 02-07-2026న సి.ఆర్.ఓ. కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను టీటీడీ సిబ్బంది గుర్తించి పోలీసులకు అప్పగించారు. దర్యాప్తులో మొబైల్ యాప్‌ల ద్వారా నకిలీ ఆధార్ కార్డులను తయారు చేసి టీటీడీ గదులను పొందడం, అనంతరం వాటిని రూ.2,000 నుంచి రూ.3,000 వరకు అధిక ధరలకు భక్తులకు విక్రయిస్తూ వచ్చినట్లు వెల్లడైంది. వారి సమాచారంతో మరో నిందితుడిని కూడా అరెస్టు చేశారు.

**అరెస్టు చేసిన నిందితులు వివరాలు**

1. ఎం. వేణుగోపాల్ (తెలంగాణ), 2. దొంత రవీంద్రబాబు (ఆంధ్రప్రదేశ్)
3. సంతోష్ కుమార్ (ఉత్తరప్రదేశ్), 4. టి. ఈశ్వర్ (తెలంగాణ)

2 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు

**12 నకిలీ ఆధార్ కార్డులు**

డిజిటల్ ఆధారాలు: ఈ ముఠా గత కొంతకాలంగా నకిలీ ఆధార్ కార్డులతో టీటీడీ గదులను అక్రమంగా పొందుతూ శ్రీవారి భక్తులను, టీటీడీని మోసం చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ అక్రమ దందాను ఛేదించిన తిరుమల II టౌన్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులను తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మరియు టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ, అభినందించారు.

**శ్రీవారి భక్తులకు విజ్ఞప్తి:**


టీటీడీ వసతి గదులను అధికారిక కౌంటర్లు లేదా అధికారిక ఆన్‌లైన్ విధానాల ద్వారానే పొందాలి. దళారులు లేదా మధ్యవర్తులను ఆశ్రయించ రాదు. ఎవరైనా అధిక ధరలకు గదులు విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే తిరుమల పోలీసులు లేదా టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. భక్తులను మోసం చేసే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.





# విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి సాదరవీడ్కోలు

రేణిగుంట ( సింధూర దర్శిని) 3 జూలై తిరుపతి జిల్లా ; తిరుపతి జిల్లా పర్యటన అనంతరం కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ సున్నపురాళ్ళపల్లె లో జే ఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి బయలుదేరు నిమిత్తం శుక్రవారం రేణిగుంట విమానా శ్రయంకు చేరుకున్న ముఖ్యమంత్రి వర్యులకు సాగర వీడ్కోలు లభించింది. జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యే లు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, భాను ప్రకాష్, కోనేటి ఆదిమూలం, మురళి మోహన్, ఆర్ డి ఓ భానుప్రకాశ్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు తదితరులు ముఖ్యమంత్రికి సాదరవీడ్కోలు పలికినవారిలో ఉన్నారు.





# డిజిటల్ ఇండియా 11 ఏళ్ల ప్రస్థానం

## పౌరులు, వ్యాపారాల ప్రగతికి నూతన మార్గం

కేవలం దశాబ్దం క్రితం, ఉత్తరప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామ రైతు సబ్సిడీలను పొందడానికో లేదా దిగుబడిని పెంచుకునే సలహాల తెలుసుకోవాలనుకుంటే చాలా ఇబ్బంది పడేవారు. పైగా కార్యాలయాల దగ్గర పొడవాటి వరుసల్లో నిలబడాల్సి వచ్చేది. కానీ నేడు అదే రైతు తన పంటలకు సంబంధించిన సహాయాన్ని సులభంగా పొందగలుగుతున్నాడు, ఎలాంటి మధ్యవర్తులు ప్రమేయం లేకుండా సబ్సిడీలు నేరుగా అతని బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి.

ఏ వీధిలో నడిచి వెళ్తున్నా ప్రజల జీవన విధానాన్ని సులభతరం చేసిన నిశ్శబ్ద విప్లవాన్ని చూడొచ్చు. ఒకప్పుడు నగదు మార్పిడిపైనే పూర్తిగా ఆధారపడిన స్థానిక పండ్ల వ్యాపారో, ఆటోరిక్షా డ్రైవరో.. ఇప్పుడు తన దగ్గరున్న క్యూఆర్ కోడ్‌ను గర్వంగా చూపిస్తున్నాడు.

భారత్ నేడు ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న 102.86 కోట్ల మంది పౌరులు, 99.56 కోట్ల భారీ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులున్నారు. మొబైల్ డేటా ధర ఒక జీబీకి కేవలం రూ.8--10 మాత్రమే ఉండడంతో, సగటున ఒక వ్యక్తి నెలకు ఉపయోగించే డేటా అసాధారణంగా 24.01 జీబీకి చేరింది. ఈ డిజిటల్ పునాది పౌరుడికి, ప్రభుత్వానికి మధ్య సంబంధాన్ని పూర్తిగా మార్చేసింది; దీనిని నమ్మకం, పారదర్శకత, డిజిటల్ స్వయంప్రతిపత్తితో సుస్థిరం చేసింది. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, పౌరులకు సమాన అవకాశాలను కల్పించే ప్రజాస్వామ్య సాధనంగా సాంకేతికత పనిచేయాలని, వారి జీవనాన్ని, వ్యాపార నిర్వహణను సులభతరం చేయాలని డిజిటల్ ఇండియా నిరూపించింది.

అంతరాలను తొలగించడం

ఈ విప్లవంలో మొదటి అడుగు సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక స్వావలంబనకు హామీ ఇచ్చే బలమైన, స్వదేశీ డిజిటల్ గుర్తింపు వ్యవస్థను నిర్మించడం. భారత్‌నెట్ చొరవను భారీ స్థాయిలో అమలు చేసి, దాదాపు 2.2 లక్షల గ్రామ పంచాయతీలను హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌తో విజయవంతంగా అనుసంధానించారు, దీనివల్ల ఆర్థిక అవకాశాలకు భౌగోళిక ప్రాంతం ఇకపై ఎంతమాత్రం అడ్డంకి కాకుండా పోయింది.

ఈ మౌలిక సదుపాయాల పురోగతి, 144 కోట్లకు పైగా ఆధార్ గుర్తింపుల సృష్టి, జన్ ధన్-ఆధార్-మొబైల్ (జీఎవీ) త్రయానికి బలాన్నిచ్చాయి. ఈ సార్వభౌమ డిజిటల్ గుర్తింపు చట్రాన్ని ఉపయోగించడం ద్వారా, ప్రభుత్వం ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా రూ.51.5 లక్షల కోట్లను నేరుగా పౌరుల ఖాతాల్లోకి విజయవంతంగా బదిలీ చేసింది. ఈ వ్యవస్థ లోటుపాట్లను సమర్థవంతంగా అరికట్టింది, మధ్యవర్తులను తొలగించింది, ఆర్థిక స్వయంప్రతిపత్తిని నేరుగా పౌరుల చేతుల్లో పెట్టడం ద్వారా లక్షలాది కుటుంబాల జీవన విధానాన్ని అనూహ్యంగా మెరుగుపరిచింది.

డిజిటల్ వ్యవస్థల ప్రభావం: దైనందిన జీవితం, వ్యాపారాల మార్పు

భారతదేశపు డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు (ఖూ×) వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించే మార్గాలను సృష్టించడం ద్వారా పౌరుల దైనందిన జీవితాలను మార్చేశాయి. 'డిజీలాకర్' వంటి వేదికలు పౌరులు, వ్యాపారాల పనులను సులభతరం చేశాయి. 70 కోట్లకు పైగా నమోదిత వినియోగదారులు, 900 కోట్లకు పైగా డిజిటల్ పత్రాలను కలిగి ఉన్న ఈ వ్యవస్థ, కాగితాలను భౌతికంగా తీసుకెళ్లే శ్రమను తప్పించి, కేవైసీ ప్రక్రియలను, పత్రాల ధృవీకరణ తక్షణమే పూర్తయ్యేలా చేసింది. వ్యాపారాల పరంగా..ఇది వినియోగదారులను చేర్చుకునే ఖర్చును, సమయాన్ని గణనీయంగా తగ్గించింది; బ్యాంకులు, టెలికాం ఆపరేటర్లు, ఫిన్‌టెక్ సంస్థలు ఇప్పుడు కస్టమర్ వివరాలను రోజుల తరబడి కాకుండా కేవలం సెకన్లలో ధృవీకరిస్తున్నాయి.

గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్ (+వవీ) ద్వారా, ప్రభుత్వం రూ.19.51 లక్షల కోట్లకు పైగా విలువైన కొనుగోళ్లను నిర్వహించింది. ఒక చిన్న తయారీదారు లేదా మొదటి సారి వ్యాపారం ప్రారంభించిన విక్రేతకు, ఇది మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ కాంట్రాక్టులను పొందే వ్యాపార అవకాశంగా మారింది.

ప్రజా సేవలను రిమోట్‌గా పొందేందుకు, ఉమాంగ్ అప్లికేషన్ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ సేవలను నేరుగా పౌరుల అరచేతిలోకి తీసుకువచ్చింది. ఇది 11.6 కోట్లకు పైగా నమోదిత వినియోగదారులకు సేవలందిస్తోంది, 2,572 ప్రభుత్వ సేవలకు అవకాశాన్ని ఇస్తూ, ఇప్పటివరకు 797.84 కోట్ల లావాదేవీలను సులభతరం చేసింది.

ఈ సాంకేతిక వ్యవస్థలో ప్రతిష్టాత్మకమైనది యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (ఖు×). ప్రస్తుతం రోజుకు 75 కోట్ల లావాదేవీలను నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపులలో దాదాపు సగం భారతదేశంలోనే జరుగుతున్నాయి, ఐఎమ్ఎఫ్ కూడా యూపీఐ ని ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ చెల్లింపు వ్యవస్థగా గుర్తించింది.



భారత్ తన డిజిటల్ పరిపాలన వేదికల అనురణ, స్వీకరణ కోసం అధికారికంగా అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసిన 24 దేశాలలో సేవలందిస్తోంది. అలాగే.. యూపీఐ ఇప్పుడు యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్‌తో సహా 9 దేశాలలో అందుబాటులో ఉంది. సాంకేతికతను ప్రజా ప్రయోజనంగా పరిగణించే విధానం.. ఆరోగ్య సమానత్వానికి కూడా వర్తిస్తుంది. ఈ-సంజీవని వేదిక ద్వారా, భారత్ 48 కోట్లకు పైగా ఉచిత టెలి-కన్సల్టేషన్లను అందించింది, దీనివల్ల మారుమూల, వైద్య సదుపాయాలు లేని ప్రాంతాల్లోని రోగులు కూడా నిపుణులైన వైద్యుల్ని సంప్రదించగలుగుతున్నారు. అలాగే.. ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమానికి స్వదేశీ వేదిక ఆసరా అయ్యింది. 220 కోట్లకు పైగా కోవిడ్-19 వ్యాక్సిన్ డోసులు పారదర్శకంగా పంపిణీ, ట్రాకింగ్ చేయబడ్డాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు అధ్యయనం చేసిన బలమైన సాంకేతికతను ఏర్పాటు చేసింది.

డిజిటల్ ఇండియా 11వ సంవత్సరాన్ని పూర్తి చేసుకుంటున్న తరుణంలో, ఈ మిషన్ కీలక సాంకేతికతల పై దృష్టి సారిస్తోంది. ఇవి భారత్, గ్లోబల్ సౌత్ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి ప్రజా ప్రయోజనాలుగా ఉపయోగపడేలా చూస్తోంది.

దశాబ్దాలుగా కంప్యూటింగ్ పవర్ వ్యయం కారణంగా చిన్న పట్టణాల్లోని ఆవిష్కర్తలు అధునాతన సాంకేతికతకు దూరంగా ఉన్నారు. ఇండియా-ఏఐ మిషన్ కింద, స్టార్టప్‌ల వ్యాపార నిర్వహణను సులభతరం చేయడానికి ప్రభుత్వం ఈ అడ్డంకిని క్రమంగా తొలగిస్తోంది. అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి భారీ, ఉమ్మడి కంప్యూట్ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. స్వదేశీ స్టార్టప్‌లు, విద్యార్థులకు గంటకు కేవలం రూ.65 కే ప్రపంచ స్థాయి కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందించడం ద్వారా, క్షేత్రస్థాయిలో ఆవిష్కరణలను ప్రోత్సహించడం దీని లక్ష్యం. భారత్ ను ప్రపంచంలోనే ఏఐ అప్లికేషన్ల రాజధానిగా మార్చడమే దీని ధ్యేయం, తద్వారా మన ప్రతిభావంతులైన శ్రామిక శక్తి అన్ని రంగాలలోని వ్యాపారాలలో ఉత్పాదకతను పెంచుతుంది.

అదే సమయంలో, భారత్ తన హార్డ్‌వేర్ భవిష్యత్తును సురక్షితం చేసుకుంటోంది. సెమికాన్ ఇండియా కార్యక్రమం కింద, దేశవ్యాప్తంగా రూ.1.65 లక్షల కోట్ల పెట్టుబడితో 12 సెమీకండక్టర్ తయారీ, ప్యాకేజింగ్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రగతిని కొనసాగిస్తూ, కేంద్ర బడ్జెట్ 2026--27 లో ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 ను ప్రకటించారు. సెమీకండక్టర్ పరికరాలు, మెటీరియల్స్‌పై దృష్టి సారించడం, పూర్తి-స్థాయి భారతీయ మేధో సంపత్తిని రూపొందించడం, ప్రపంచ సరఫరా గొలుసులను బలోపేతం చేయడం ద్వారా తయారీ రంగాన్ని మించి ముందుకు వెళుతుంది. ఈ పథకం కింద 24 సెమీకండక్టర్ డిజైన్ స్టార్టప్‌లకు ఆమోదం లభించడంతో, భారతదేశం దాని సామర్థ్య సృష్టిని వేగంగా బలమైన సాంకేతిక పరిజ్ఞానంగా మారుస్తోంది. ఇది ఆధునిక ప్రపంచానికి శక్తినిచ్చే చిప్‌లను రూపొందించే శక్తివంతమైన దేశీయ పర్యావరణ వ్యవస్థను పెంపొందిస్తోంది. ఈ ప్రయత్నం అందించిన నిజమైన వారసత్వం దేశ ఆలోచనా విధానంలోనే కనిపిస్తోంది. ఎందుకంటే నేడు ప్రజలు సరికొత్త ఆవిష్కరణలు, సులువైన వ్యాపార లావాదేవీలు, పరిపాలన వంటి సేవలు నేరుగా తమ చేతివేళ్ల వద్దే లభించాలని ఆశిస్తున్నారు. సాంకేతికత అనేది అందరికీ భాగస్వామ్యం కల్పించేలా, సులభంగా అందుబాటులో ఉండేలా, దేశ సార్వభౌమ బలానికి సాధనంగా నిలిచేలా చేయడం ద్వారా, డిజిటల్ ఇండియా మనం 2047 నాటికి కలలుగంటున్న 'వికసిత్ భారత్' నిర్మాణానికి నిశ్శబ్దంగా పునాది వేస్తోంది.

# అమర్‌నాథ్‌లో మంచు శివలింగం ఎలా ఏర్పడుతుంది?

అమర్‌నాథ్ మంచు శివలింగం సహజంగా ఏర్పడే 'ఐస్ స్టాలగ్‌మైట్'

మంచు కరిగిన నీరు గడ్డకట్టడం వల్ల ప్రతి ఏడాది ఏర్పడుతున్న శివలింగం

భక్తుల రాక, ఉష్ణోగ్రతల, మంచు కురిసిన పరిమాణం వల్ల మారుతున్న శివలింగం సైజు

ప్రకృతి, పురాణ విశ్వాసం కలిసిన అరుదైన అద్భుతం అమర్‌నాథ్



అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైన ప్రతిసారి భక్తుల్లో ఒక ప్రశ్న తప్పక తలెత్తుతుంది. గుహలోని మంచు శివలింగం ఏటా సహజంగా ఎలా ఏర్పడుతుందన్నదే ఆ ప్రశ్న. కోట్లాది మంది భక్తులకు అది పరమశివుడి దివ్య స్వరూపం. అదే సమయంలో శాస్త్రవేత్తలు ఈ ఆధ్యాత్మిక అద్భుతం వెనుక ఆసక్తికరమైన భౌగోళిక ప్రక్రియ ఉందని చెబుతున్నారు.

**శివలింగం ఎలా ఏర్పడుతుంది?**

శ్రీనగర్‌కు ఈశాన్యంగా సుమారు 145 కిలోమీటర్ల దూరంలో, దాదాపు 4,000 మీటర్ల ఎత్తులో అమర్‌నాథ్ గుహ ఉంది. గుహపై ఉన్న సున్నపురాయి, జిప్సం శిలల పగుళ్ల ద్వారా హిమనదాలు, మంచు కరిగిన నీరు నెమ్మదిగా గుహలోకి చేరుతుంది. లోపల మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతల కారణంగా ఆ నీరు ఒక్కో పొరగా గడ్డకడుతుంది. ఇలా పొరపై పొర ఏర్పడుతూ పైకి ఎదిగే మంచు స్తంభమే భక్తులు దర్శించే మంచు శివలింగం. భూగర్భ శాస్త్రంలో దీనిని 'ఐస్ స్టాలగ్‌మైట్' అని పిలుస్తారు.

**ఎందుకు మళ్లీ కరిగిపోతుంది?**

పౌర్ణమి వరకు మంచు శివలింగం క్రమంగా పెరిగి, తర్వాత అమావాస్య వచ్చేకొద్దీ చిన్నదవుతుందనే విశ్వాసం ఉంది. దీనికి ఉష్ణోగ్రతలు కూడా ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యాత్ర సమయంలో వేలాది మంది భక్తులు గుహలోకి రావడంతో లోపలి ఉష్ణోగ్రత పెరుగుతుంది. దాంతో మంచు వేగంగా కరుగుతుంది. అంతేకాదు మంచు కురిసిన పరిమాణం, హిమనదాల కరుగుదల, గుహలోని వాతావరణం కూడా శివలింగం పరిమాణాన్ని ప్రభావితం చేస్తాయి.

**శాస్త్రానికి విరుద్ధం కాదు**

అమర్‌నాథ్ గుహలోనే పరమశివుడు పార్వతీదేవికి సృష్టి రహస్యం, అమరత్వ రహస్యాన్ని వివరించాడని హిందూ పురాణాలు చెబుతున్నాయి. ఈ విశ్వాసమే అమర్‌నాథ్‌ను అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రంగా నిలబెట్టింది. అయితే, శాస్త్రం ఈ మంచు శివలింగం ఎలా ఏర్పడుతుందో మాత్రమే వివరిస్తుందని, దాని ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను ఏమాత్రం తగ్గించదని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. భారతదేశంలోని అనేక పవిత్ర క్షేత్రాల మాదిరిగానే అమర్‌నాథ్‌లోనూ ప్రకృతి, విశ్వాసం కలిసే అద్భుత దృశ్యమిదేనని పేర్కొంటున్నారు.

## వేసవి సెలవులు ముగిసినా.. తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

దేశం నలుమూలల నుంచి తిరుమలకు భారీగా తరలివస్తున్న భక్తులు

టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి 12 గంటల సమయం

నిన్న శ్రీవారిని దర్శించుకున్న 66,304 మంది భక్తులు



కలియుగ వైకుంఠమైన తిరుమల గిరుల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు ముగిసినప్పటికీ... వీకెండ్స్ ప్రభావం, సాధారణ రోజుల్లో సైతం దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో శ్రీవారి క్షేత్రం జనసందోహంగా మారింది. ప్రస్తుతం టోకెన్లు లేని సామాన్య భక్తులకు స్వామివారి సర్వదర్శనం కలగడానికి దాదాపు 12 గంటల వరకు సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అధికారులు వెల్లడించారు. భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్ వెలుపల ఉన్న నారాయణగిరి షెడ్ల వరకు కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో మొత్తం 66,304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,811 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిన్న ఒక్కరోజే స్వామివారి హుండీ ఆదాయం రూ. 4.51కోట్లు వచ్చినట్లు టీటీడీ పేర్కొంది.క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న చిన్నపిల్లలు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు నిరంతరాయంగా పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. టోకెన్లు లేకుండా నేరుగా తిరుమలకు వచ్చేభక్తులు ఈవేచి ఉండే సమయాన్ని గమనించి, తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని టీటీడీ సూచించింది.

## సామాన్యుడికి గుడ్డు సెగ.. కోడిగుడ్డు ధరకు రెక్కలు

ఏడు నుంచి ఎనిమిది రూపాయలకు చేరిన కోడిగుడ్డు ధర

రూ.205కి చేరిన 30 గుడ్లతో కూడిన ట్రే ధర

మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపిన అధిక ఉష్ణోగ్రతలు



కూరగాయల ధరల మంటతో ఇప్పటికే సతమతమవుతున్న సామాన్య ప్రజలకు కోడిగుడ్ల ధరలు కూడా షాకిస్తున్నాయి. హైదరాబాద్ లో గతంలో ఐదు నుండి ఆరు రూపాయలు పలికిన ఒక్కో గుడ్డు ధర... ప్రస్తుతం మార్కెట్లో ఏడు నుండి ఎనిమిది రూపాయల వరకు చేరుకుంది. ఇక హోల్‌సేల్ మార్కెట్‌లో 30 గుడ్లతో కూడిన ఒక ట్రే ధర ఏకంగా రూ.205కి చేరింది. మునుపెన్నడూ లేని విధంగా చికెన్, గుడ్ల ధరలు అమాంతం పెరిగిపోవడంతో అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం రాష్ట్రంలో నమోదవుతున్న విపరీతమైన ఎండలేనని పౌల్ట్రీ ఫారాల నిర్వాహకులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల కోళ్లు సరిగ్గా మేత తినకపోవడంతో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. దీనికి తోడు హీట్ స్ట్రోక్ కారణంగా పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడటం మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఫలితంగా డిమాండ్‌కు తగ్గ సప్లై లేక ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్ల వినియోగం ఎక్కువగా ఉండటంతో నిర్వాహకులపై అదనపు భారం పడుతోంది. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీల్లో కేక్‌ల తయారీకి గుడ్లు తప్పనిసరి కావడంతో వ్యాపారాలు సాగించడం కష్టంగా మారిందని వారు వాపోతున్నారు. గత 25 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారి మాట్లాడుతూ... తన సుదీర్ఘ అనుభవంలో ఎప్పుడూ గుడ్డు ధర ఇంత గరిష్ఠ స్థాయికి చేరలేదని, రెండేళ్ల క్రితం కేవలం కొన్ని రోజులు మాత్రమే ఇలాంటి పరిస్థితి చూశామని తెలిపారు.

# మోదీకి చంద్రబాబు వంటి నేతలు తోడైతే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది: సజ్జన్ జిందాల్

ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌పై సజ్జన్ జిందాల్ ప్రశంసలు - కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం

రాష్ట్రంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు పెడతామని జిందాల్ ప్రకటన

ఈ పెట్టుబడులతో 50 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని హామీ - చంద్రబాబు లాంటి నేతలుంటే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్న జిందాల్



ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి దార్శనికత ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉంటారని, ఆయన వచ్చే 25 ఏళ్ల అభివృద్ధిని ముందుగానే ఆలోచించి అమలు చేస్తారని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు విజన్ వల్లే సైబరాబాద్ నగరం ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా ఎదిగిందని ఆయన గుర్తుచేశారు. దేశాభివృద్ధి గురించి నిత్యం తపించే ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు లాంటి ముఖ్యమంత్రులు తోడైతే, దేశం మరింత వేగంగా లక్ష్యాలను అందుకుంటుందని జిందాల్ అభిప్రాయపడ్డారు. చంద్రబాబు వంటి నేతలతో కలిసి పనిచేయడం పారిశ్రామికవేత్తగా తనకు గౌరవమని ఆయన పేర్కొన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, సజ్జన్ జిందాల్‌తో కలిసి ఆయన కాంక్రీట్ వేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ తమ గ్రూప్ తరపున ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ.50వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్టు సంచలన ప్రకటన చేశారు. ఈ పెట్టుబడులతో సుమారు 50వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు విజయనగరం జిల్లాలో ఒక ఇండస్ట్రియల్ పార్కును కూడా ఏర్పాటు చేస్తున్నామని జిందాల్ వెల్లడించారు. ప్రస్తుతం ఏడాదికి 1 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ప్రారంభమవుతున్న ఈ స్టీల్ ప్లాంట్‌ను భవిష్యత్తులో మరింతగా విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ స్టీల్ ప్లాంట్‌ను మొత్తం రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడితో రెండు దశల్లో నిర్మించనున్నారు. తొలిదశ పూర్తయితే ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. స్టీల్ ప్లాంట్‌తో పాటు, దీనికి అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు.

## ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా : ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



గూడూరు (సింధూర దర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; ధైర్యంగా ఉండండి అండగా ఉంటానని పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువారం రాత్రి ప్రమాదవశాత్తు కోట మండలానికి చెందిన ఇద్దరూ కార్యకర్తలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో శుక్రవారం కోట ప్రభుత్వ హాస్పిటల్లో మృతదేహాలను పరిశీలించి , వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ఉండాలని చెప్పారు. అంతేకాకుండా ఒక్కో కుటుంబానికి 50వేల రూపాయలు అందించి వారికి అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి , సర్వోత్తమ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం: వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు




చాపాడు (సింధూర దర్శిని) 3 జూలై కడప జిల్లా ; చాపాడు మండలంలోని నక్కల దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అయ్య వారి పల్లె సచివాలయం లో ఉన్న రాజువారిపేట గ్రామం లో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ర్యాలీ,లార్వా సర్వే ,ఫీవర్ సర్వే, చేశారని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు తెలియజేశారు. గ్రామంలోని ప్రజలకు దోమల వల్ల కలుగు వ్యాధులను వివరించి, డెంగ్యూ రహిత సమాజం మన అందరి లక్ష్యం కావాలని దోమలను తరిమికొట్టాలని,, దోమతెరలు వాడుకోవాలని, ప్రాణాలను కాపాడుకోవాలని,అనే నినాదంతో ప్రజలందరూ బాధ్యత వహించి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ,ఇంటిలోని సిమెంటు తొట్లు, డ్రమ్ములు, ఎయిర్ కూలర్లు ఫ్రిడ్జు పాత టైర్లు వాడి పడేసిన కొబ్బరి బొండాలలో నీటి నిలువలు ఉండకుండా చూసుకోవాలని వారానికి ఒకసారి ఆ నీటి నిలువలను తీసివేయాలని ప్రజలకు డాక్టర్ పి.ఓబులేసు తెలియజేశారు ఫ్రైడే డ్రై డే తప్పకుండా పాటించాలని ప్రజలకు తెలిపారు,.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యం రాఘవయ్య, డిప్యూటీ హెచ్ ఈ ఓ జయ ప్రకాశ్, సూపర్‌వైజర్స్ ప్రసాద్ భవానీ, ఆశా కార్యకర్త పార్వతీ, ప్రజలు పాల్గొన్నారు..

# పీఎఫ్ ఖాతాల్లో రూ.9,330 కోట్లు..

## ఆ డబ్బు మాది అని అడిగేవారే లేరు!

-నిరుపయోగంగా 31 లక్షల ఈపీఎఫ్ ఖాతాలు

-అందులో మూలుగుతున్న రూ.9,330 కోట్ల కార్మికుల సొమ్ము

-'ఇండియా టుడే' ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైన నిజాలు

-కొత్త ఈపీఎఫ్ స్కీమ్ 2026 వచ్చినా తీరని పాత సమస్య

-ఈ నిధులతో మూడు కొత్త ఐఐటీలు నిర్మించవచ్చని అంచనా

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారుల కోసం సరికొత్త 'ఈపీఎఫ్ స్కీమ్-2026'ను నోటిఫై చేసి డిజిటల్ యుగానికి శ్రీకారం చుట్టింది. అయితే, మరోవైపు దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల నిరుపయోగ ఈపీఎఫ్ ఖాతాల్లో దాదాపు రూ.9,330 కోట్లకు పైగా కార్మికుల సొమ్ము క్లెయిమ్ చేయకుండా మూలుగుతోందన్న సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. 'ఇండియా టుడే' ప్రత్యేకంగా సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం ద్వారా పొందిన ఈ వివరాలు బయటకు వచ్చాయి.

1952 నాటి పాత పథకం స్థానంలో జూన్ 29 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఈపీఎఫ్ స్కీమ్-2026, నిబంధనలను సరళతరం చేయడం, వ్యవస్థను డిజిటలైజ్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా సుమారు 8 కోట్ల మంది యాక్టివ్ చందాదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సంస్కరణల నేపథ్యంలో కార్మికుల పదవీ విరమణ పొదుపు ఎంత పెద్ద మొత్తంలో వారికి చేరకుండా నిలిచిపోయిందో ఆర్టీఐ గణాంకాలు కళ్లకు కడుతున్నాయి.

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) అందించిన సమాచారం ప్రకారం.. 2026 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా 30,91,862 నిరుపయోగ ఖాతాలు ఉన్నాయి. వీటిలో సుమారు రూ.9,330 కోట్లు క్లెయిమ్ చేయని నిల్వలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పరిస్థితి స్వల్పంగా మెరుగుపడినప్పటికీ, సమస్య తీవ్రత మాత్రం తగ్గలేదు. 2025 మార్చి 31 నాటికి 31.83 లక్షల ఖాతాల్లో రూ.10,181 కోట్లు ఉండగా, ఏడాది వ్యవధిలో నిరుపయోగ ఖాతాల సంఖ్య 92,000, క్లెయిమ్ చేయని మొత్తం రూ.851 కోట్లు తగ్గింది. అయితే, ఇప్పటికీ దాదాపు 31 లక్షల ఖాతాలు నిద్రాణంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం.

### రూ.9,330 కోట్లతో ఏం చేయవచ్చు?

ఈపీఎఫ్ ఖాతాల్లో మూలుగుతున్న ఈ భారీ మొత్తం ఎంత పెద్దదో అర్థం చేసుకోవాలంటే కొన్ని ప్రభుత్వ పథకాలతో పోల్చి చూడాలి.

2016లో ప్రారంభించిన ప్రాంతీయ కనెక్టివిటీ పథకం 'ఉడాన్' కోసం కేంద్రం ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ.10,169 కోట్లతో ఈ మొత్తం దాదాపు సమానం.

కేంద్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై)కు కేటాయించిన నిధులకు ఇది దాదాపు సమానం.

2014 ప్రభుత్వ అంచనా ప్రకారం ఒక ఐఐటీని ఏర్పాటు చేయడానికి రూ.1,750 కోట్లు ఖర్చవుతుంది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2026 నాటికి దీని విలువ రూ.2,934 కోట్లు. అంటే, ఈపీఎఫ్ ఖాతాల్లోని డబ్బుతో మూడు కొత్త ఐఐటీలను నిర్మించి, ఇంకా రూ.500 కోట్లకు పైగా మిగుల్చుకోవచ్చు. ఈ పోలిక కేవలం ఉదాహరణ మాత్రమే అయినప్పటికీ, కార్మికుల సొమ్ము ఎంత భారీ స్థాయిలో నిలిచిపోయిందో స్పష్టం చేస్తోంది.

### సమాచారం ఇవ్వని ఈపీఎఫ్ఓ

గత ఐదేళ్లుగా నిరుపయోగ ఖాతాల సంఖ్య, వాటిలోని మొత్తం వివరాలను 'ఇండియా టుడే' ఆర్టీఐ ద్వారా కోరింది. అయితే, ఈపీఎఫ్ఓ కేవలం 2025, 2026 సంవత్సరాల సమాచారాన్ని మాత్రమే అందించగలమని తెలిపింది. 2025-26లోనే 'ఇనాపరేటివ్ అకౌంట్స్ సెల్' (ఐఏసీ)ను ఏర్పాటు చేశామని, అంతకుముందు సంవత్సరాల సమాచారం తమ వద్ద లేదని పేర్కొంది.

అంతేగాక, ఆధార్‌తో అనుసంధానమైన నిరుపయోగ ఖాతాలు, వాటిలోని మొత్తం, ఆటో-సెటిల్‌మెంట్ స్థితి వంటి వివరాలను వెల్లడించడానికి ఈపీఎఫ్ఓ నిరాకరించింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఇ) ప్రకారం, విశ్వసనీయ సంబంధం కింద ఉన్న సమాచారాన్ని బహిర్గతం చేయలేమని తెలిపింది. రూ.5 లక్షలకు పైగా బ్యాలెన్స్ ఉన్న నిరుపయోగ ఖాతాల వివరాలు కోరగా, ఆ ఫార్మాట్‌లో డేటా నిర్వహించడం లేదని బదులిచ్చింది.


మొత్తం మీద కొత్త సంస్కరణలు అమలు చేస్తున్నప్పటికీ, కార్మికుల కష్టార్జితం వారికి చేరడంలో దశాబ్దాలుగా ఉన్న సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# అట్టహాసంగా జాఫర్ జన్మదిన వేడుకలు

స్నేహితులు, బంధుమిత్రుల మధ్య జన్మదిన వేడుకలు -జాఫర్ జన్మదిన వేడుకలు సందర్భంగా బ్లడ్ డొనేషన్







గూడూరు (సింధూర దర్శిని) 3 జూలై నెల్లూరు జిల్లా ; ముస్లిం మైనార్టీ నాయకులు జాఫర్ జన్మదిన వేడుకలు స్నేహితులు , బంధుమిత్రుల మధ్య అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా స్నేహితులు, బంధుమిత్రులు జాఫర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నిండు నూరేళ్లు, ఆయురారో గ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఇంకా మరెన్నో పదవులు అధిరోహించాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని మెడ్ ప్లస్‌లో 14మందితో బ్లడ్ డొనేషన్ చేయించడం జరిగిం దని తెలిపారు. అంతేకాకుండా నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన స్నేహి తులు బంధుమిత్రులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను అని అన్నారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో బంధుమిత్రులు , స్నేహితులు పాల్గొన్నారు.

# వానాకాలంలోనూ 'డ్రై ఐస్' సమస్య.. నిపుణులు హెచ్చరిస్తున్న కారణాలివే!

వర్షాకాలంలో గాలిలో తేమ పెరిగినా కళ్లు పొడిబారే సమస్య తగ్గదన్న నిపుణులు

అలర్జీలు, ఏసీ వాడకం, కాలుష్యం వంటివి 'డ్రై ఐస్'ను మరింత తీవ్రతరం చేస్తాయని వెల్లడి

కంప్యూటర్లు, ఫోన్ల వాడకం పెరగడం వల్ల కళ్లు పొడిబారే ప్రమాదం ఎక్కువ

నీళ్లు ఎక్కువగా తాగడం, తరచూ కళ్లు ఆర్పడం వంటివి సమస్యను నివారించగలవన్న నిపుణులు



వర్షాకాలం రాగానే, మండుతున్న వేసవి నుంచి ఉపశమనం లభిస్తుంది. చల్లటి వాతావరణం, పచ్చదనం మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. గాలిలో తేమ శాతం పెరగడం వల్ల కళ్లు పొడిబారే (డ్రై ఐస్) సమస్య కూడా తగ్గుతుందని చాలామంది భావిస్తారు. కానీ, ఇది కేవలం ఒక అపోహ మాత్రమేనని, వర్షాకాలంలో కంటి ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరచూ మారే వాతావరణ పరిస్థితులు, గాలిలో పెరిగే అలర్జీ కారకాలు, ఇళ్లలో ఏసీల వాడకం, కాలుష్యం, దుమ్ము, పెరిగిన స్క్రీన్ టైమ్ వంటి అనేక అంశాలు కంటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వారు స్పష్టం చేస్తున్నారు.

కంటి వైద్య నిపుణుల ప్రకారం.. 'డ్రై ఐ డిసీజ్' అనేది కేవలం శీతాకాల సమస్య కాదు. ఏడాది పొడవునా ముఖ్యంగా వర్షాకాలంలోనూ ఇది ఇబ్బంది పెట్టగలదు. దీనికి గల కారణాలను అర్థం చేసుకుని, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**ఏమిటీ 'డ్రై ఐ' డిసీజ్?**

కళ్లు తగినంత కన్నీటిని ఉత్పత్తి చేయనప్పుడు లేదా ఉత్పత్తి అయిన కన్నీరు వేగంగా ఆవిరైపోయినప్పుడు 'డ్రై ఐ డిసీజ్' వస్తుంది. కళ్లను తేమగా ఉంచడానికి, స్పష్టమైన చూపునకు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడానికి కన్నీటి పొర (టియర్ ఫిల్మ్) చాలా అవసరం.

ఈ పొర దెబ్బతిన్నప్పుడు కళ్లలో మంట, దురద, ఎరుపెక్కడం, కళ్లలో ఇసుక పడినట్లు అనిపించడం, కళ్ల నుంచి అధికంగా నీరు కారడం, చూపు మసకబారడం, కళ్లు అలసిపోవడం, వెలుతురును చూడలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. విచిత్రంగా కళ్లు పొడిబారినప్పుడు చికాకుకు ప్రతిస్పందనగా అధికంగా నీరు కారడం కూడా ఈ వ్యాధి లక్షణాలలో ఒకటి.

**వర్షాకాలంలో సమస్య ఎందుకు తీవ్రమవుతుంది?**

గాలిలో తేమ ఉన్నప్పటికీ, అనేక పర్యావరణ అంశాలు కళ్లపై ప్రభావం చూపుతాయి.

1.వాతావరణంలో ఆకస్మిక మార్పులు: వర్షాకాలానికి ముందు, ఆ సమయంలో వాతావరణంలో తేమ శాతం వేగంగా మారుతుంది. ఒకరోజు పొడిగా, వేడిగా ఉంటే మరుసటి రోజు చల్లగా, తేమగా ఉంటుంది. ఈ ఆకస్మిక మార్పులు కన్నీటి పొర స్థిరత్వాన్ని దెబ్బతీసి, ఇప్పటికే డ్రై ఐస్ సమస్యతో బాధపడేవారిలో లక్షణాలను తీవ్రతరం చేస్తాయి.

2.అలర్జీ కారకాల పెరుగుదల: వానాకాలం ఫంగస్, బూజు, దుమ్ము పురుగులు పెరగడానికి అనువైన పరిస్థితులను కల్పిస్తుంది. ఈ అలర్జీ కారకాలు కంటి ఉపరితలాన్ని చికాకుపరిచి డ్రై ఐస్ లక్షణాలను పెంచుతాయి. చాలామంది దీనిని సాధారణ అలర్జీగా పొరబడతారు.

3.ఏసీల వాడకం: వర్షాకాలంలోనూ ఉక్కపోత కారణంగా చాలామంది ఇళ్లలో, ఆఫీసుల్లో ఎక్కువ గంటలు ఏసీలు వాడుతుంటారు. ఏసీలు గదిలోని తేమను తగ్గించి, గాలిని పొడిగా మారుస్తాయి. దీనివల్ల కన్నీరు వేగంగా ఆవిరైపోయి కళ్లు పొడిబారతాయి.

4.కాలుష్యం, దుమ్ము: భారీ వర్షాలు కురవడానికి ముందు నగరాల్లో కాలుష్యం, నిర్మాణాల వల్ల దుమ్ము, ధూళి ఎక్కువగా ఉంటుంది. ఈ రేణువులు కళ్లకు చికాకు కలిగించి, సమస్యను మరింత జఠిలం చేస్తాయి.

**స్క్రీన్ టైమ్ సమస్యను రెట్టింపు చేస్తుంది**

కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు లేదా టీవీల వైపు ఎక్కువసేపు ఏకాగ్రతతో చూడటం వల్ల కనురెప్పలు ఆర్పే వేగం గణనీయంగా తగ్గుతుంది. ఇది డ్రై ఐస్ సమస్యను మరింత పెంచుతుంది. దీనిని నివారించడానికి ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును కనీసం 20 సెకన్ల పాటు చూడాలి (20-20-20 రూల్). దీనివల్ల కళ్లకు విశ్రాంతి లభించి, రెప్పలార్పడం సహజంగా జరుగుతుంది.

**సాధారణ నివారణ మార్గాలు**

వాతావరణం చల్లగా ఉన్నా రోజంతా తగినన్ని నీళ్లు తాగాలి.

వైద్యుని సలహా మేరకు ప్రిజర్వేటివ్ రహిత లూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్ వాడాలి.

ఫ్యాన్లు లేదా ఏసీల గాలి నేరుగా ముఖానికి తగలకుండా చూసుకోవాలి.

ఇంటి లోపల గాలి మరీ పొడిగా అనిపిస్తే హ్యూమిడిఫైయర్ వాడటం మంచిది.

కళ్లను శుభ్రమైన నీటితో సున్నితంగా కడుక్కోవాలి, పదేపదే నలపకూడదు.

కాంటాక్ట్ లెన్స్‌లను సరిగ్గా శుభ్రపరచాలి, నిర్దేశించిన సమయం కంటే ఎక్కువసేపు ధరించవద్దు.

వృద్ధులు, ముఖ్యంగా మెనోపాజ్ దశ దాటిన మహిళల్లో హార్మోన్ల మార్పుల కారణంగా డ్రై ఐస్ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. పైన చెప్పిన జాగ్రత్తలు తీసుకున్నా లక్షణాలు తగ్గకపోతే, వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించి, సరైన చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రారంభ దశలోనే గుర్తించి జీవనశైలిలో మార్పులు చేసుకుంటే, సమస్య తీవ్రం కాకుండా నివారించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ఏఐ ఎఫెక్ట్: పోవడం కాదు.. తొలి ఉద్యోగం దొరకడమే పెద్ద సవాలు!

తొలి ఉద్యోగాలపై ఏఐ ప్రభావం పెరుగుతోందన్న డబ్ల్యూఈఎఫ్ నివేదిక

కొత్త నియామకాల వృద్ధి మందగించిందని వెల్లడి

ఫైనాన్స్,ఐటీ రంగాలపై అధికప్రభావముందని స్పష్టీకరణ

ఏఐ ఒక్కటే కారణం కాదన్న నివేదిక

నైపుణ్యాలున్న వారికి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని సూచన



డిగ్రీ పూర్తయితే ఉద్యోగం దొరుకుతుందనే నమ్మకం మారుతోంది. ఉద్యోగాలను ఏఐ లాక్కుంటుందనే భయం కంటే.. తొలి ఉద్యోగమే దొరకడమే పెద్ద సవాలుగా మారుతోంది. ప్రపంచ ఆర్థిక వేదిక తాజా నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఏఐ ప్రభావం ఎక్కువగా ఉన్న రంగాల్లో కొత్త ఉద్యోగాల వృద్ధి దాదాపు నిలిచిపోయిందని వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వేదిక, పీడబ్ల్యూసీ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 37 శాతం మంది యువ ఉద్యోగులు ఏఐ ప్రభావం ఎక్కువగా ఉండే రంగాల్లో పనిచేస్తున్నారు. తూర్పు ఆసియాలో ఈ సంఖ్య 75 శాతానికి, ఉత్తర అమెరికాలో 69 శాతానికి, యూరప్‌లో 63 శాతానికి చేరింది. ఫైనాన్స్, ఐటీ, కమ్యూనికేషన్, ప్రొఫెషనల్ సేవలు, విద్యా రంగాలపై ఏఐ ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపింది.

2012 నుంచి చాలా రంగాల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు పెరిగాయి. కానీ, ఏఐ ప్రభావం అత్యధికంగా ఉన్న రంగాల్లో మాత్రం కొత్త నియామకాల సంఖ్య పెరగలేదని అధ్యయనం తెలిపింది. ఉద్యోగాలు పూర్తిగా మాయమవలేదు. కానీ కొత్త అవకాశాలు మాత్రం ఆశించిన స్థాయిలో పెరగడం లేదని వెల్లడించింది. దీంతో గ్రాడ్యుయేట్ల మధ్య పోటీ మరింత పెరుగుతోందని పేర్కొంది. ఉద్యోగాల మందగమనానికి ఏఐ ఒక్కటే కారణం కాదని నివేదిక స్పష్టం చేసింది.

ఆర్థిక అనిశ్చితి, వ్యయ నియంత్రణ, కంపెనీల నియామక విధానాల్లో మార్పులు కూడా ప్రభావం చూపుతున్నాయని తెలిపింది. చాలాసార్లు సంస్థలు ఏఐని కారణంగా చూపుతున్నప్పటికీ, వాస్తవానికి ఇతర ఆర్థిక కారణాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. ఏఐతో పనిచేసే నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులకు భవిష్యత్తులో ఎక్కువ అవకాశాలు ఉంటాయని నివేదిక సూచించింది. కొన్ని సంస్థలు ఇప్పటికే ఇంటర్న్‌షిప్‌లు, ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో ఏఐ నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. తొలి ఉద్యోగాలను తగ్గించడం కంటే, వాటిని కొత్త అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడమే సరైన మార్గమని ప్రపంచ ఆర్థిక వేదిక సూచించింది.

# సినిమా న్యూస్

## 'నాగబంధం'- మూవీ రివ్యూ!



ఒకే ఒక సినిమా అనుభవం ఉన్న హీరోతో 100 కోట్ల బడ్జెట్ తో ఒక సినిమా తీయాలనుకోవడం అంత ఆషామాషీ విషయమేం కాదు. కానీ 'నాగబంధం' సినిమా విషయంలో ఇలాంటి ఒక అద్భుతం జరిగింది. 'పెదకాపు' అనే ఒకే ఒక సినిమా చేసిన 'విరాట్ కర్ణ'తో 'నాగబంధం' సినిమా తెరకెక్కింది. భారీ బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమాకి అభిషేక్ నామా దర్శకత్వం వహించాడు. నభా నటేశ్ .. జగపతిబాబు కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది.

ఆర్కియాలజీ డిపార్టుమెంట్ లో ప్రభాకర్ (జగపతిబాబు) చీఫ్ గా పనిచేస్తుంటాడు. ఆధ్యాత్మిక పరమైన అంశాలపై అపారమైన ఆసక్తి ఉన్న కారణంగా ఆయన ఎక్కువగా ఆ విషయాలపై ఫోకస్ చేస్తుంటాడు. పురాణాలలో పేర్కొనబడిన విరాటమూర్తి ఆలయం ఎక్కడ ఉందనేది తెలుసుకోవడం కోసం ఆయన తన అన్వేషణ కొనసాగిస్తూ ఉంటాడు. ఈ విషయంపై ఆయన సహచరులైన టెస్లా .. అలీ (రిషబ్ సాహ్నీ) హిమాలయాలలో అన్వేషించడం మొదలుపెడతారు. అక్కడి గుహలో కాలవృక్షం చేత బంధించబడిన బైరాగి (గరుడ రామ్)ను చూస్తారు.

బైరాగి తన మాటల చేత అలీని తన వైపుకు తిప్పుకుంటాడు. అతీతమైన శక్తులు .. అపారమైన సంపదలు దక్కించుకోవాలంటే, విష్ణుమూర్తి ఆలయానికి సంబంధించిన నాగబంధం విడిపించమని చెబుతాడు. నాగబంధనం విడదీయాలంటే, రహస్యంగా ఉంచబడిన 'బ్రహ్మకమలం'.. 'గరుడ మంత్రాలు'ను సాధించవలసి ఉందని అంటాడు. తనని కాలవృక్షం నుంచి విడిపించడానికి కూడా అవే అవసరమవుతాయని చెబుతాడు. దాంతో అలీ వాటిని సాధించే పనిలో పడతాడు. అందుకోసం తన అనుచరులను అన్ని దిక్కులకు పంపిస్తాడు.

'తులసివనం'లో 'రుద్ర' ( విరాట్ కర్ణ) తన చెల్లెలు మానస (సోనియా సింగ్)తో కలిసి నివసిస్తూ ఉంటాడు. పడవ నడుపుతూ జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. వారి గ్రామదేవత మానసాదేవి. తన చెల్లి రాజు ప్రేమలో పడిందని తెలుసుకున్న రుద్ర, వాళ్ల పెళ్లికి అంగీకరిస్తాడు. పెళ్లి చేయడానికి అవసరమైన డబ్బును ఎలా సమకూర్చాలా అని ఆలోచన చేస్తుంటాడు. అదేసమయంలో అలీ అనుచరులు 'రుద్ర'ను కలుస్తారు. పడవలో తమని 'భైరవకోన' తీసుకెళ్లమని అడుగుతారు.

గతంలో బ్రహ్మ కమలం' కోసం ప్రభాకర్ ప్రయత్నించి విఫలమవుతాడు. అతను వదిలేసిన 'భైరవకోన'లోనే ఆ 'బ్రహ్మ కమలం' ఉందని అలీ అనుచరులు తెలుసుకుంటారు. అందువలన అక్కడికి తమని పడవలో తీసుకుని వెళితే పెద్ద మొత్తంలో ముట్టజెబుతామని అంటారు. డబ్బు కోసమే ఎదురుచూస్తున్న 'రుద్ర' వాళ్లను వెంటబెట్టుకుని భైరవకోనకి బయల్దేరతాడు.

అలీ మనుషులు అన్వేషిస్తున్న 'బ్రహ్మ కమలం' గురించిగానీ, దాని మహిమను గురించి గాని అతనికి తెలియదు. అందువలన దానిని సాధించడంలో వాళ్లకి సాయపడదామని అనుకుంటాడు. అప్పుడు ఏం జరుగుతుంది? ఆ ప్రయత్నంలో అతనికి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? ఆ బ్రహ్మకమలంతో అతనికి గల సంబంధం ఏమిటి? పురావస్తు విభాగానికి చెందిన ప్రభాకర్ కూడా దానికోసం ఎందుకు ట్రై చేస్తున్నాడు? అనేది మిగతా కథ.

అతీతమైన శక్తులను .. అపారమైన సంపదలను ప్రసాదించే 'బ్రహ్మ కమలం' చుట్టూ తిరిగే కథ ఇది. తన స్వార్థం కోసం ఆ బ్రహ్మ కమలాన్ని దక్కించుకోవడానికి విలన్ ప్రయత్నించడం .. హీరో అడ్డు కోవడమే ఈ కథలోని ప్రధానమైన అంశం. పురావస్తు విభాగంలో పనిచేసే ప్రభాకర్ బ్రహ్మకమలం కోసం ఎందుకు ట్రై చేస్తున్నాడు? ఆ బ్రహ్మ కమలాన్ని కాపాడే శక్తి హీరోకి మాత్రమే ఎందుకు ఉంది? అనేది ఆడియన్స్ ను ఆలోచింపజేసే మరో ఆసక్తికరమైన విషయం.

విరాటమూర్తి ఆలయం .. నాగబంధం గురించిన రహస్యాలను తెలుసుకునే పనిలో ప్రభాకర్ నిమగ్నమై ఉంటాడు. కాలవృక్షం నుంచి విముక్తిని పొందాలనే ఆత్రుతలో బైరాగి .. అతని ద్వారా బ్రహ్మకమలాన్ని సొంతం చేసుకోవాలనే దురాశతో అలీ ఉంటారు. బ్రహ్మకమలం గొప్పతనం తెలియని హీరో .. దానిని వెతికే విలన్ గ్యాంగ్ కి దారిచూపిస్తుంటాడు. ఇలా బ్రహ్మకమలాన్ని కేంద్రంగా చేసుకుని, ఈ కథ అన్ని వైపుల నుంచి నడుస్తుంటుంది. దాని చుట్టూనే ప్రధానమైన పాత్రలన్నీ ప్రదక్షిణ చేస్తుంటాయి.

ఈ కథ మొదలైనప్పుడు ఇది అనంతపద్మనాభ స్వామి ఆలయానికి సంబధించిన చరిత్రను .. అక్కడి నిధి రహస్యాలు .. విస్మయులను చేసే అక్కడి విశేషాలను కలుపుకుంటూ సాగే కథ అనిపిస్తుంది. ఆ తరువాత బ్రహ్మకమలం ఉన్నది శ్రీరంగపురంలో అంటూ, శ్రీరంగానికి దగ్గరగా ఉన్న పేరు వాడారు. శ్రీ రంగనాథస్వామి పేరు మనకి ఎక్కువగా వినిపిస్తుంది. అయితే పై రెండు క్షేత్రాలకు సంబంధించిన విషయాలలో కమిట్ కాకపోవడం వలన, ఆడియన్స్ లో తొలి అయోమయం ఇక్కడి నుంచే మొదలవుతుంది.

హీరోకి మరణం లేని వరం కావాలి .. దానిని ప్రసాదించే బ్రహ్మ కమలం కావాలి. అయితే అతను ఆశపడుతున్న దానిని బ్రహ్మకమలం ఎలా అందిస్తుంది? దానిని ఉపయోగించే విధానం ఎలా ఉంటుంది? అనేది ఆడియన్స్‌కి క్లారిటీ రాదు. కాలవృక్షానికి బందీగా ఉన్న బైరాగి కూడా నిధి నిక్షేపాలు చూసి ఉక్కిరిబిక్కిరైపోతాడు తప్ప అంతకుమించిన అతీంద్రియ శక్తులపై దృష్టి పెట్టినట్టుగా కనిపించడు. ఇక హీరోను కొన్ని సందర్భాలలో మెడలో పాము వేసి .. త్రిశూలం పట్టించి చూపించారు. ఇతనే శివుడు అనుకోవాలా? లేదంటే ఇతనికి శివానుగ్రహం ఉందనుకోవాలా? అనేది మరో కన్ఫ్యూజన్. ఇలాంటి కన్ఫ్యూజన్‌లు ఈ సినిమాలో చాలానే ఉంటాయి.

కథ .. కథనాలు చూస్తే మనకి 'అంజి' సినిమా గుర్తుకువస్తుంది. కథను ఎత్తుకున్న తీరు కూడా చాలా దగ్గరగా అనిపిస్తుంది. కథాకథనాల సంగతి అటుంచితే, ఆ రెండింటినీ వీఎఫ్ ఎక్స్ డామినేట్ చేసిందనే చెప్పాలి. దర్శకుడు విజువల్ వండర్ గా తీర్చిదిద్దడానికి ట్రై చేసినట్టుగా తెలిసిపోతూ ఉంటుంది. కొన్ని చోట్ల వీఎఫ్ ఎక్స్ బాగానే అనిపించినప్పటికీ, అక్కడక్కడా తేలిపోవడం కూడా మనకి తెలుస్తూనే ఉంటుంది.

ఆరంభంలో హిమాలయాలలోని గుహలకు సంబంధించిన షాట్స్ .. మానసాదేవి జాతర నేపథ్యంలో సీన్స్ .. అనంత పద్మనాభస్వామివారి ఆలయ నేపథ్యంలో సన్నివేశాలు .. బ్రహ్మ కమలాన్ని దొంగిలించడం .. దానిని తీసుకుని వెళుతుంటే గరుడపక్షి దాడి చేయడం వంటి దృశ్యాలు కూడా ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ బ్యాంగ్ .. క్లైమాక్స్ రేంజ్ లో డిజైన్ చేశారు. సెకండాఫ్ లో యాక్షన్ సీన్స్ ను అవసరానికి మించి సాగదీశారు.

అమరత్వం కోసం ఆరాటపడే విలన్ ఆ విషయాన్ని మరిచిపోయినట్టుగా కనిపిస్తాడు. చెల్లెలి పెళ్లి కోసం బ్రహ్మ కమలం వెంటపడిన ఓ సాధారణ యువకుడు, చివర్లో సనాతన ధర్మం గురించి భారీ డైలాగులు చెబుతాడు. చాలా ఏళ్లుగా బందీగా ఉండి విముక్తుడైన బైరాగి ప్రధానమైన ఉద్దేశం ఏమిటనేది అంతుచిక్కదు. తెరపై కావాల్సినంత భారీతనం కనిస్తుంది. కానీ కథాకథనాలపై సరైన కసరత్తు జరగలేదేమో అనిపించే కంటెంట్ ఇది.

నిర్మాణ పరమైన విలువల పరంగా ఈ సినిమాకి వంక బెట్టలేం. సుందర రాజన్ కెమెరా పనితనం .. జునైద్ కుమార్ – అబె సంగీతం మెప్పిస్తుంది. ఎడిటింగ్ పరంగా చూసుకుంటే, పెంచుకుంటూ వెళ్లిన యాక్షన్ సీన్స్ ను కాస్త ట్రిమ్ చేసుకుంటూ రావొచ్చు.

అనంతపద్మనాభ స్వామివారి మూర్తి .. బ్రహ్మకమలంగా బ్రహ్మదేవుడి మూర్తితో కూడిన స్వర్ణ పుష్పాన్ని డిజైన్ చేసిన తీరు మాత్రం చాలా బాగుంది. అనంతపద్మనాభ స్వామి వారి ఆలయ నేపథ్యం .. అక్కడ డిజైన్ చేసిన సాంగ్ .. ఈ సినిమాకి హైలైట్ అనే చెప్పాలి. కథాకథనాల పరంగా అంత బలంగా లేని ఈ కంటెంట్, గ్రాఫిక్స్ పరంగా కాస్త ఎక్కవ మార్కులే కొట్టేస్తుందని చెప్పాలి.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: నాగబంధం
విడుదల తేదీ: 2026-07-03
తారాగణం: విరాట్ కర్ణ, నభా నటేష్, జగపతి బాబు, రిషబ్ సాహ్నీ, శరణ్య, అనసూయ
దర్శకుడు: అభిషేక్ నామా
సంగీతం: జునైద్ కుమార్ –అబే
బ్యానర్: NIK స్టూడియోస్
సమీక్ష: పెద్దింటి
నాగబంధం రేటింగ్: 5కి 2.25



స్టైలిష్ మిర్రర్ సెల్ఫీ లుక్‌లో అబ్బురపరిచిన అన్వేషి జైన్. ఈ స్టైలిష్ మిర్రర్ సెల్ఫీలో, సొగసును బోల్డ్, సమకాలీన వైబ్‌తో మేళవించి అన్వేషి జైన్ ఆకట్టుకుంటున్నారు.

## గట్టి పోటీ.. ఈసారి బన్నీకా? కొత్త వారికా?



72వ నేషనల్ ఫిల్మ్ అవార్డుల అనౌన్స్మెంట్ పై ఇప్పుడు సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా బెస్ట్ యాక్టర్ అవార్డు ఎవరికి దక్కుతుందన్న చర్చ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే ఒకసారి నేషనల్ బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకున్న అల్లు అర్జున్ మరోసారి అదే ఘనతను అందుకుంటారా? లేక కొత్త నటుడు ఆ అవార్డును సొంతం చేసుకుంటారా? అన్నది ఉత్కంఠ నెలకొంది. మరికొన్ని గంటల్లో ప్రకటించనున్న 72వ జాతీయ చలనచిత్ర అవార్డులు 2024లో విడుదలైన సినిమాలకు సంబంధించినవి. ఇందులో బెస్ట్ యాక్టర్ సెగ్మెంట్ అత్యంత ఆసక్తికరంగా మారింది. ఈసారి సౌత్ నుంచి పలువురు స్టార్ హీరోలు గట్టిగా పోటీ పడుతున్నారు. ఆ లిస్ట్ లో మాలీవుడ్ స్టార్ హీరో మమ్ముట్టి భ్రమయుగం సినిమాతో టాప్ లో ఉన్నారు. ఆ చిత్రంలో ఆయన నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. అలాగే తమిళ స్టార్ విక్రమ్ తంగలాన్ చిత్రంలో తన యాక్టింగ్ తో ప్రత్యేక గుర్తింపు పొందారు. పాత్ర కోసం ఆయన హార్డ్ వర్క్ కూడా ప్రశంసలు అందుకుంది. మరోవైపు మలయాళ నటుడు ఆసిఫ్ అలీ కిష్కింధకాండ చిత్రంలో తన నటనతో ఆకట్టుకున్నారు. అలాగే మంజుమ్మల్ బాయ్స్ సినిమాలో నటించిన సాబిన్ సాహిర్ కూడా ఈసారి బెస్ట్ యాక్టర్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో టాలీవుడ్ సినీ ఇండస్ట్రీ తరఫున అల్లు అర్జున్ పేరు గట్టుగా వినిపిస్తోంది. పుష్ప-2లో ఆయన యాక్టింగ్ కు అభిమానులతో పాటు సినీ సెలబ్రిటీల నుంచి కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే పుష్ప-1 సినిమాతో జాతీయ ఉత్తమ నటుడి అవార్డు అందుకున్న అల్లు అర్జున్, ఇప్పుడు మరోసారి అదే అవార్డు అందుకుంటారా అనే ఆసక్తి నెలకొంది. అదే జరిగితే వరుసగా రెండు సినిమాలతో జాతీయ అవార్డు అందుకున్న నటుడిగా మరో ప్రత్యేక గుర్తింపు ఆయన సొంతమవుతుంది. అయితే ఈసారి పోటీ మాత్రం చాలా గట్టిగా కనిపిస్తోంది. మమ్ముట్టి, విక్రమ్, ఆసిఫ్ అలీ, సాబిన్ సాహిర్ వంటి నటులు తమ తమ సినిమాల్లో అద్భుతమైన యాక్టింగ్ తో అదరగొట్టడంతో విజేత ఎవరనే విషయంపై ఇప్పటివరకు క్లారిటీ లేదు. అందుకే బెస్ట్ యాక్టర్ విభాగంపై అందరి దృష్టి పడింది. వాస్తవానికి నేషనల్ ఫిల్మ్ అవార్డులు ఎప్పుడూ యాక్టింగ్ కు అత్యున్నత గుర్తింపుగా భావిస్తారు. అందుకే ఆ అవార్డును అందుకోవడం ప్రతి నటుడి కెరీర్ లో స్పెషల్ మూమెంట్ గా నిలుస్తుంది. ఈసారి కూడా అదే స్థాయిలో పోటీ నెలకొనడంతో అనౌన్స్మెంట్ కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి మరోసారి అల్లు అర్జున్ చరిత్ర సృష్టిస్తారా? లేక కొత్త విన్నర్ నేషనల్ ఫిల్మ్ బెస్ట్ యాక్టర్ అవార్డు కైవసం చేసుకుంటారా? అనే ప్రశ్నకు సమాధానం మరికొన్ని గంటల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రానున్న ప్రకటనతో తేలనుంది. అప్పటివరకు సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతూనే ఉండనుంది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662